# సాక్షి
## అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 12 । ఫిబ్రవరి । 2025



పాడేరు డిపోలో నిలిచిపోయిన బస్సులు

### న్యూస్‌రీల్‌

### ఆకట్టుకున్న దుంప



జి.మాడుగుల: మండలంలోని నుర్మతి పంచాయతీ మద్ది వీధి గ్రామ సమీపన గల అటవీ ప్రాంతంలో మంగళవారం జరిపిన తవ్వకాల్లో గ్రామానికి చెందిన బాబురావుకు పొడవైన నాగలి దుంప లభ్యమైంది. పొడవుగా పాము ఆకారంలో ఉన్న ఈ దుంప స్థానికులను ఆకట్టుకుంది. సంతలో దీనికి రూ.500 నుంచి రూ.600 వరకు ధర లభిస్తుందని గ్రామస్తులు తెలిపారు.

### రిటైర్డ్‌ పీడీకి మూడు పతకాలు


పతకాలు సాధించిన రిటైర్డ్‌ పీడీ భిక్షం

చింతూరు: అనంతపురంలో ఈనెల 7నుంచి 9 వరకు జరిగిన రాష్ట్రస్థాయి మాస్టర్స్‌ అథ్లెటిక్‌ పోటీల్లో 60 ప్లస్‌ కేటగిరీలో చింతూరుకు చెందిన రిటైర్డ్‌ పీడీ మెండు భిక్షం మూడు పతకాలు సాధించారు. షాట్‌పుట్‌లో బంగారు, డిస్కస్‌ త్రోలో బంగారు, హేమర్‌ త్రోలో వెండి పతకం సాధించిన ఆయన మార్చిలో బెంగళూరులో జరిగే నేషనల్‌ మీట్‌కు ఎంపికయ్యారు.

### వ్యాయామ ఉపాధ్యాయులకు పతకాల పంట


కప్‌ అందుకుంటున్న వ్యాయామ ఉపాధ్యాయులు

చింతూరు: రాష్ట్ర పీఈటీ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 8 నుంచి 10 వరకు కాకినాడలో నిర్వహించిన వ్యాయామ ఉపాధ్యాయుల క్రీడా పోటీల్లో చింతూరు ఐటీడీఏ పరిధిలోని పాఠశాలలకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు పలు పతకాలు సాధించారు. వంద మీటర్ల పరుగు పందెంలో లక్ష్మణరావు, వాలీబాల్‌లో రమేష్‌, కబడ్డీలో శ్రీను, గంగాభవానీ బంగారు పతకాలు సాధించారు. షాట్‌పుట్‌లో నాగిరెడ్డి, జావలిన్‌ త్రోలో వెంకటేష్‌ వెండి పతకాలు సాధించారు. లాంగ్‌జంప్‌లో లక్ష్మణరావు, కబడ్డీలో మురళి, ప్రసాద్‌, రమేష్‌బాబు, ఫుట్‌బాల్‌లో వెంకటేష్‌ బ్రాంజ్‌ పతకాలను పొందారు. రంపచోడవరం ఐటీడీఏ తరపున 800 మీటర్ల పరుగుపందెంలో పాల్గొన్న పోతురాజు, జావలిన్‌ త్రో, వాలీబాల్‌లో సీతమ్మ, కబడ్డీలో నరసన్నదొర బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన ఉపాధ్యాయులను ఏటీడబ్ల్యూవోలు కంచర్ల సుజాత, రామతులసి, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు అభినందించారు.

### యథావిధిగా నేడు ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్ష

సాక్షి,పాడేరు: ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షను బుధవారం యథావిధిగా నిర్వహించనున్నట్టు కలెక్టర్‌ ఎ.ఎస్‌.దినేష్‌కుమార్‌ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 11వ తేదీ మంగళవారం రద్దు అయిన ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్ష మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తరువాత ప్రకటిస్తామని పేర్కొన్నారు.

### పొగమంచుతో ఇక్కట్లు


చింతపల్లిలో కురుస్తున్న మంచు

చింతపల్లి: జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రతలు పెరిగి కొనసాగుతున్నప్పటికీ, మంచు ప్రభావం యథావిధిగా ఉంది. ఉదయం 9 గంటలు దాటినా పొగమంచు దట్టంగా కురుస్తుండడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులు పడుతున్నారు. మంగళవారం డుంబ్రిగుడలో 12.9 డిగ్రీలు, అనంతగిరిలో 14.1 డిగ్రీలు, చింతపల్లిలో 15.0 డిగ్రీలు, జి.మాడుగులలో 16.9 డిగ్రీలు, జీకే వీధిలో 14.5 డిగ్రీలు, హుకుంపేటలో 14.0 డిగ్రీలు, కొయ్యూరులో 19.8 డిగ్రీలు, పాడేరులో 15.9 డిగ్రీలు పెదబయలులో 13.9 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదైనట్టు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్‌, వాతావరణ విభాగం నోడల్‌ అధికారి డాక్టర్‌ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు.



పాడేరులో ధర్నా చేస్తున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స, సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, డీఎల్‌వో కేంద్ర ప్రతినిధి మాణిక్యం, గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు

# బంద్‌ సక్సెస్‌

- అయ్యన్న వ్యాఖ్యలపై ఆగ్రహించిన అడవి బిడ్డలు
- తెల్లవారు జాము నుంచే రోడ్లపైకి వచ్చిన అఖిలపక్ష నేతలు
- డిపోకే పరిమితమైన ఆర్టీసీ బస్సులు
- మూతబడిన వర్తక, వాణిజ్య సముదాయాలు
- తిరగని ప్రైవేటు వాహనాలు
- పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు విశ్వేశ్వరరాజు, మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబుతో సహా నేతలు రోడ్లపై బైఠాయింపు
- రోడ్లపైనే భోజనాలతో నిరసన

పాడేరు: గిరిజనుల ప్రధాన చట్టం 1/70ను సవరించి టూరిజం అభివృద్ధి చేయాలన్న శాసన సభ స్పీకర్‌ వ్యాఖ్యలపై గిరిజనులు భగ్గుమన్నారు. అయ్యన్న పాత్రుడు వ్యాఖ్యలకు నిరసనగా చేపట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ మంగళవారం విజయవంతంగా జరిగింది. పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో అఖిలపక్షంగా ఏర్పడిన సీపీఎం, సీపీఐ తదితర రాజకీయ పార్టీలు, దండకారణ్య లిబరేషన్‌ ఆర్గనైజేషన్‌, పలు గిరిజన, విద్యార్థి, ప్రజా సంఘాల సభ్యులు జిల్లా కేంద్రమైన పాడేరుతో పాటు అన్ని మండలాల్లో వేకువజాము నుంచే రోడ్లపైకి వచ్చి బంద్‌ నిర్వహించారు. ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు, ఎమ్మెల్సీ డాక్టర్‌ కుంభ రవిబాబు, సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స, సీపీఐ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర,గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, దండకారణ్య లిబరేషన్‌ ఆర్గనైజేషన్‌ కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, ఇతర ముఖ్య నాయకులు పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌ వద్దకు చేరుకుని ప్రధాన రహదారిపై బైఠాయించారు. అయ్యన్నపాత్రుడికి, రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. కాంప్లెక్స్‌ వద్ద పాడేరు సీఐ దీనబంధు ఆధ్వర్యంలో భారీ ఎత్తున బందోబస్తు నిర్వహించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌తో పాటు గొందూరు జంక్షన్‌, మెయిన్‌ బజార్‌, వంతాడపల్లి చెక్‌పోస్టు వద్దకు భారీ సంఖ్యలో గిరిజనులు, నాయకులు చేరుకుని ఆయా మార్గాల్లో రాకపోకలు సాగించే వాహనాలను అడ్డుకున్నారు. పాడేరు డీఎస్పీ సాబాజ్‌ అహ్మద్‌ పోలీసు బందోబస్తును పర్యవేక్షించారు. అరకులోయలో ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు, డుంబ్రిగుడ, హుకుంపేట, అరకులోయలో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, హుకుంపేట, పాడేరు ఘాట్‌లోని 12వ మైలురాయి జంక్షన్‌ వద్ద ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్‌ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి, జీసీసీ మాజీ చైర్‌పర్సన్‌ డాక్టర్‌ స్వాతిరాణి, వైఎస్సార్‌సీపీ నేతలు ఆందోళన చేసి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. పాడేరులో మాజీ ఎమ్మెల్యే, ఎస్టీ సెల్‌ రాష్ట్ర అధ్యక్షురాలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, పెదబయలులో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ ఆధ్వర్యంలో నేతలు రోడ్లపై బైఠాయించారు.

**స్తంభించిన జనజీవనం**

జిల్లా వ్యాప్తంగా జనజీవనం స్తంభించింది. ఎక్కడికక్కడ వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాల నుంచి విశాఖ, ఎస్‌.కోట, చోడవరం, నర్సీపట్నం ప్రాంతాలకు ఆర్టీసీ బస్సులు తిరగలేదు. పాడేరు డిపోకే బస్సులు పరిమితమయ్యాయి. రంపచోడవరం నుంచి చింతూరు మీదుగా పలు సర్వీసులను పోలీసు భద్రత మధ్య నడిపారు. జీపులు, ఇతర ప్రైవేటు సర్వీసులు తిరగలేదు. 108, ఇతర అంబులెన్స్‌ వాహనాలకు మాత్రమే ఆందోళనకారులు అనుమతి ఇచ్చారు.

**మూతపడిన దుకాణాలు**

జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అన్ని మండల కేంద్రాలు, ప్రధాన జంక్షన్‌లలో దుకాణాలు, పెట్రోల్‌ బంక్‌లను వ్యాపారులు స్వచ్ఛందంగా మూసివేశారు. సంతలు రద్దయ్యాయి. ప్రభుత్వ, ప్రైవేట్‌ విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షను వాయిదా వేశారు. ప్రభుత్వ కార్యాలయాలు నామమాత్రంగానే పనిచేశాయి. వాణిజ్య బ్యాంక్‌లు తెరచుకోలేదు. మన్యం బంద్‌తో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

## గిరిజన చట్టాల జోలికి వస్తే సహించేది లేదు

### ఎమ్మెల్సీ కుంభా రవిబాబు


హుకుంపేటలో ధర్నా నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, ఎంపీపీ కూడా రాజు

హుకుంపేట: రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ హుకుంపేట మండలంలో ప్రశాంతంగా జరిగింది. ఈ బంద్‌లో ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు,అఖిల పక్ష నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుంభా రవిబాబు మాట్లాడుతూ గిరిజన చట్టాల జోలికి వస్తే సహించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూడా రాజుబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్‌, పార్టీ గౌరవ అధ్యక్షుడు గండేరు చిన సత్యం, నాయకులు సివేరి కొండలరావు, విశ్వేశ్వర రావు, భూషణ్‌, చిన్నబ్బి, కొండబాబు, వైస్‌ ఎంపీపీ కొండలరావు, సీపీఎం, గిరిజన సంఘం నాయకులు తాపుల కృష్ణారావు, హైమవతి, రామరావు, కాంగ్రెస్‌ పార్టీ నాయకులు జానకీరావు, సర్పంచ్‌లు,ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

**వనరులు దోచుకోడానికి కుట్ర**


హుకుంపేటలో జరిగిన బంద్‌లో పాల్గొన్న జెడ్పీ చైర్‌ పర్సన్‌ సుభద్ర,మాజీ ఎంపీ మాధవి, మాజీ జీసీసీ చైర్‌పర్సన్‌ శోభ స్వాతిరాణి, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి తదితరులు

గిరిజన చట్టాలజోలికొస్తే సహించబోమని జెడ్పీచైర్‌పర్సన్‌ జల్లిపల్లి సుభద్ర, మాజీ ఎంపీ మాధవి,మాజీ జీసీసీ చైర్‌పర్సన్‌ శోభహైమవతి, పాడేరు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. హుకుంపేటలో జరిగిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌లో వీరు పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీలో వనరులను దోచుకోడానికి కూటమి ప్రభుత్వం కుట్రపన్నుతోందని ఆరోపించారు. స్పీకర్‌ అయ్యన్న పాత్రుడు తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు.

## అయ్యన్నపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి


దష్ప వాయిస్తున్న ఎమ్మెల్యే మత్స్యలింగం, ఎమ్మెల్సీ రవిబాబు తదితరులు

అరకులోయటౌన్‌: 1/70 చట్టాన్ని సవరించాలన్న స్పీకర్‌ అయ్యన్నపాత్రుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు డిమాండ్‌ చేశారు. నియోజకవర్గ కేంద్రమైన అరకులోయలో నాలుగు రోడ్ల జంక్షన్‌ వద్ద ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, ఎమ్మెల్సీ కుంభా రవిబాబు, నాయకులు ఉదయం 6 గంటల నుంచి ధర్నా నిర్వహించి, వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ 1/70 చట్టాన్ని తుంగలోకి తొక్కి గిరిజన హక్కులను కాలరాసేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. గిరిజన చట్టాలపై అనుచితంగా మాట్లాడిన అయ్యన్న పాత్రుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. మన్యం బంద్‌ సందర్భంగా అరకులోయ పట్టణంలో వ్యాపారులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేశారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, పెట్రోల్‌ బంకులు మూతపడ్డాయి. ఉదయం 5 గంటల నుంచే అఖిలపక్ష నాయకులు రోడ్లపైకి వచ్చి వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలోవైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్‌ రాష్ట్ర కార్యదర్శి పాంగి చిన్నారావు, బీసీ సెల్‌ జిల్లా అధ్యక్షుడు గెడ్డం నర్సింగరావు, నాయకులు విజయ్‌ కుమార్‌, ఎల్‌.బి.కిరణ్‌కుమార్‌, శెట్టి వెంకట్‌రావు, భూర్జ సుందరరావు, గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్‌, కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాచిపెంట శాంతకుమారి పాల్గొన్నారు.

## దిగి వచ్చిన ప్రభుత్వం

- 1/70 జోలికి వెళ్లబోమని ప్రకటించిన సీఎం
- బంద్‌ విరమించిన అఖిలపక్షం
- గిరిజనులకు నష్టం కలిగిస్తే మళ్లీ ఉద్యమిస్తాం : పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు


అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : 1/70 చట్టాన్ని సవరించాలని స్పీకర్‌ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం నిర్వహించిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్‌ విజయవంతం కావడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. 1/70 చట్టాన్ని సవరించబోమని సీఎం చంద్రబాబునాయుడు ప్రకటించారు. దీంతో రెండో రోజు బుధవారం నిర్వహించవలసిన బంద్‌ను విరమించారు. ఆర్టీసీ కాంప్లెక్స్‌ సమీపంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు మంగళవారం సాయంత్రం అత్యవసరంగా సమావేశమయ్యారు. 48 గంటల నిరవధిక బంద్‌ను ఒక్కరోజుతో ముగిస్తున్నామని ప్రకటించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతానికి నష్టం చేసే విధంగా ఎవరు ప్రవర్తించినా పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని స్పష్టం చేశారు. అఖిలపక్ష పిలుపుతో బంద్‌కు సహకరించిన ప్రతి ఒకరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స, సీపీఐ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, డీఎల్‌వో కేంద్ర ప్రతినిధి సమరెడ్డి మాణిక్యం, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, గిరిజన సమాఖ్య జిల్లా కార్యదర్శి కూడా రాధాకృష్ణ, పలు రాజకీయ పార్టీల నాయకులు, గిరిజన, ఆదివాసీ, ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.


దుకాణాలు మూతతో పాటు జనసంచారం లేని పాడేరు మెయిన్‌రోడ్డు


నిర్మానుష్యంగా ఉన్న పాడేరు ప్రధాన రహదారిపై క్రికెట్‌ ఆడుతున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు


పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్‌ వద్ద రహదారిపై భోజనం చేస్తున్న అఖిలపక్ష నాయకులు


బంద్‌ కారణంగా మూతపడిన చాపరాయి జలపాతం

## నులిపురుగుల మాత్ర మింగిన చిన్నారి మృతి


రేష్మిత మృతదేహం

రంపచోడవరం/మారేడుమిల్లి: నులిపురుగుల నివారణ కోసం వేసిన ఆల్బెండజోల్‌ మాత్ర కారణంగా మారేడుమిల్లి మండలం తాడేపల్లి గ్రామానికి కత్తుల వెంకటరెడ్డి,సుబ్బలక్ష్మిదంపతుల కుమార్తె రేష్మిత (5) మృతి చెందింది. తాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం చిన్నారి భోజనం చేసిన వెంటనే ఆల్బెండజోల్‌ మాత్ర వేశారు. దీంతో ఒక్కసారిగా వాంతులు చేసుకుంది. వెంటనే రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు చిన్నారి మృతి చెందినట్టు తెలిపారు.రంపచోడవరం ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ శేషిరెడ్డి మాట్లాడుతూ భోజనం చేసిన వెంటనే నులిపురుగుల మాత్ర ఇవ్వడంతో ఒక్కసారిగా వికారం పుట్టి వాంతులు వచ్చి ఉంటాయన్నారు. వాంతులు చేసుకునే సమయంలో ఊపిరితిత్తుల్లోకి అన్నం మెతుకులు వెళ్లడంతో ఊపిరి ఆడక మృతి చెందినట్లు భావిస్తున్నామని చెప్పారు. నులిపురుగుల మాత్ర వికటించడం వల్ల మృతి చెందలేదన్నారు. అయితే నులిపురుగుల మాత్ర సరైన పద్ధతిలో వేయకపోవడం వల్లే చిన్నారి మృతి చెందిందని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం తెలిపారు. ఇందుకు కారణమైన అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌, ఆశ వర్కర్‌, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్‌, ఫార్మసిస్టులను విధుల నుంచి సస్పెండ్‌ చేసినట్లు వెల్లడించారు.

**చిన్నారి మృతి బాధాకరం : కలెక్టర్‌**

సాక్షి,పాడేరు: మారేడుమిల్లి మండలం తాడేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో నులిపురుగుల నివారణ మాత్ర మింగిన చిన్నారి కత్తుల రేష్మిత(5) మృతిచెందడం బాధాకరమని కలెక్టర్‌ దినేష్‌కుమార్‌ ఓ ప్రకటనలో తెలిపారు. రేష్మితకు ఆల్బెండజోల్‌ మాత్ర ముక్కను ఆమె తల్లి ద్వారా వేయించినట్టు పేర్కొన్నారు. మాత్ర మింగిన అరగంటలోనే చిన్నారి వాంతులు చేసుకుని మృతిచెందినట్టు తెలిపారు. తల్లితో వేయించడాన్ని తీవ్ర తప్పిదంగా పరిగణిస్తున్నామని తెలిపారు.ఈ మేరకు ఏఎన్‌ఎం కె.చెలాయమ్మ,ఆశా వర్కర్‌ డి.సీతమ్మ,అంగన్‌వాడీ కార్యకర్త టి.నాగమణి,ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ పి.చిన్నసీతలను సస్పెండ్‌ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశామని పేర్కొన్నారు. మారేడుమిల్లి మెడికల్‌ అధికారులు హరికృష్ణ,రాణిశిరీషాలకు షోకాజ్‌ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. రేష్మిత కుటుంబానికి ఐటీడీఏ ద్వారా ఆర్థిక సాయం అందజేస్తామని పేర్కొన్నారు. విధుల్లో వైద్యబృందాలు,ఆశా, అంగన్‌వాడీ వర్కర్లు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్‌ వీడియో సమావేశంలో ఆదేశించారు.

## స్వల్పంగా పెరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు

- మొత్తం 22,493 మంది ఓటర్లు
- 123 పోలింగ్‌ స్టేషన్లు

మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్ల సంఖ్య స్వల్పంగా పెరిగింది. తొలి విడత జాబితా ప్రకారం 21,555 మంది ఓటర్లు ఉండగా.. ఈనెల 10వ తేదీ వరకు వచ్చిన ఓటర్ల నమోదు దరఖాస్తులను పరిశీలించారు. వీటిని పరిశీలన అనంతరం కొత్తగా 938 మంది ఓటర్లు పెరిగారు. తుది ఓటర్ల జాబితా ప్రకారం 22,493 మంది ఓటర్లు ఉన్నారు. అలాగే మొత్తం 123 పోలింగ్‌ స్టేషన్లు ఖరారు చేశారు.

| జిల్లా | పురుషులు | మహిళలు | ఇతరులు | పోలింగ్‌ స్టేషన్లు |
|---|---|---|---|---|
| శ్రీకాకుళం | 3,416 | 1,619 | 00 | 5,035 31 |
| విజయనగరం | 3,270 | 1,953 | 00 | 5,223 29 |
| మన్యం పార్వతీపురం | 1,574 | 759 | 00 | 2,333 15 |
| అల్లూరి సీతారామరాజు | 920 | 568 | 00 | 1,488 11 |
| విశాఖపట్నం | 2,539 | 2,990 | 00 | 5.529 13 |
| అనకాపల్లి | 1,789 | 1,096 | 00 | 2,885 24 |
| మొత్తం | 13,508 | 8,985 | 00 | 22,493. 123 |

## వైభవంగా మినీ మేడారం జాతర ప్రారంభం


జాతర ప్రారంభం సందర్భంగా జంపన్న వాగులో ప్రత్యేక పూజలు

ఎటపాక: రాష్ట్ర సరిహద్దుల్లోని మినీ మేడారం మారాయిగూడెంలో సమ్మక్క,సారలమ్మ జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఆదివాసీల ఆరాధ్యదైవాలైన సమ్మక్క, సారక్కల జాతరను ఈనెల 15వరకు నిర్వహించనున్నారు. ముందుగా ఆలయ పూజారులు, గ్రామ పెద్దలు జంపన్న చెరువు వద్ద ప్రత్యేక పూజలు జరిపి గ్రామ పొలిమేరలో మండమేలుగుట్టపైన జాతర ప్రారంభించారు. ఉదయం సమ్మక్క, సారక్క గద్దెల వద్ద దేవర బాలలు మడకం అచ్చెమ్మ, సోడి శాంతమ్మలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్ల గద్దెలను దర్శించుకున్నారు. ఛత్తీస్‌గఢ్‌,తెలంగాణా, ఆంధ్రా రాష్ట్రాల సరిహద్దుల్లో ఐదు రోజుల పాటు జరుగుతున్న ఈ జాతరను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. జాతరలో రెండవ రోజు బుధవారం సారక్కను గద్దెపైకి తేవడంతో పాటు మన రాష్ట్రంలోని జగ్గారం గ్రామం నుంచి వనదేవతను తరలించుకు రావడం వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

## ఘనంగా కొరత కొయ్య సంబరం

8లో


సీకరిలో కొరతకొయ్యను ఎత్తుతున్న భక్తులు


గంగ దేవత గుడిలో సమర్పించిన ఘటాలు

## క్లుప్తంగా

### స్పీకర్ అయ్యన్నపాత్రుడిని బర్తరఫ్ చేయాలి

- ఏయస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీను



ఎటపాక: చట్టాలపై అవగాహనలేని అయ్యన్న పాత్రుడిని స్పీకర్ పదవి నుంచి బర్తరఫ్ చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 1/70 చట్టంపై స్పీకర్ వ్యాఖ్యలు చేయడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. మంగళవారం మన్యం బంద్ విజయవంతం కావడంతో ప్రభుత్వం దిగివచ్చిందని తెలిపారు. ఆదివాసీలకు వ్యతిరేకంగా మాట్లాడిన అయ్యనపాత్రుడుపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి చట్టాన్ని సవరించే ప్రసక్తేలేదని చెప్పడం శుభపరిణామమని, దీనికి సీఎం కట్టుబడి ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ,మరో పార్టీ కుట్ర అని గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి వ్యాఖ్యలు సరైనవి కావన్నారు. ఆదివాసీలకు స్పీకర్ బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు.

### నేటి నుంచి మహా మాఘి ఉత్సవాలు



పుణ్య నదీ జలాలను కలశాలలో నింపుతున్న దేశ, విదేశీ భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో బుధవారం నుంచి నిర్వహించే మహా మాఘి ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు గురుమాత అన్నపూర్ణాదేవి తెలిపారు. పవిత్ర గంగానదీ జలాలతో పాటు, ఇతర నదీ జలాలు, పంచ పల్లవాలతో మంత్రీకరించిన కలశ స్థాపన ప్రక్రియను పూర్తిచేశారు. ఇటీవల దేవీపురం నుంచి దేశ విదేశాలకు చెందిన భక్తుల బృందం మహాకుంభమేళా పవిత్ర స్నానాలకు ప్రయాగ వెళ్లి తీసుకోచ్చిన జలాలను వేదమంత్రోచ్ఛరణల నడుమ కలశాలలో నింపినట్లు పేర్కొన్నారు. వీటితో బుధవారం ఉదయం 6 గంటల నుంచి సహస్రాక్షి అమ్మవారికి, 9 నుంచి ఉత్సవ మూర్తులతో సహా ఖడ్గమాల మూర్తులకు ఏకకాలంలో సుగంధ జల సహిత పంచామృతాభిషేకాలు జరుగుతాయని వెల్లడించారు.

### రోబోట్లు దగ్ధం

తగరపువలస: ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ పారిశ్రామిక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం అగ్నిప్రమాదం జరిగి రెండు రోబోట్లు, ఒక ప్యానల్ బోర్డు పూర్తిగా కాలిపోయాయి. సర్వే నంబర్ 230లో ఉన్న ఆజాద్ వీటీసీ ప్రయివేట్ లిమిటెడ్‌కు చెందిన ఈ సంస్థలో అగ్నిప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న తాళ్లవలస అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి అదుపు చేశారు. అప్పటికే రోబోట్లు కాలిపోయాయని అగ్నిమాపక అధికారి జి. శ్రీనివాసరాజు తెలిపారు. వీటి విలువ రూ.1.50 కోట్లు ఉండవచ్చని అంచనా.. అయితే వాటి యజమాని వచ్చే వరకు నష్టం అంచనా వేయలేమని అగ్నిమాపక అధికారి తెలిపారు.

# ఘనంగా కొరత కొయ్య సంబరం

- సిరిమానోత్సవాన్ని తలపించే విధంగా సీకరిలో జాతర
- పోటెత్తిన భక్తులు
- గంగదేవతను దర్శించుకున్న అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి
- నేటి నుంచి సంక్రాంతి పండగ ప్రారంభం



అరకు ఎంపీ గుమ్మా తనూజరాణికి గంగదేవత చిత్రపటం అందిస్తున్న గ్రామ పెద్దలు, ఉద్యోగులు



ఊరేగింపులో భక్తులు

పెదబయలు: మన్యంలో ఎక్కడా లేని విధంగా సిరిమానోత్సవాన్ని తలపించే విధంగా సీకరి గ్రామంలో మంగళవారం కొరతకొయ్య సంబరం ఘనంగా జరిగింది. తొమ్మిదిరోజుల పాటు నిర్వహించిన గంగదేవత ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు కొరతకొయ్య సంబరం జరిపారు. పెద్దఎత్తున పాల్గొన్న భక్తులు గంగదేవతను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. సీకరి గ్రామంలో ప్రతి మూడేళ్లకు ఒకసారి తొమ్మిది రోజుల పాటు జరిగే గంగదేవత పండగ కొరతకొయ్య సంబరంతో ఘనంగా ముగిసింది. కొరతకొయ్య తయారీకి తాటి కర్రను మాత్రమే ఉపయోగిస్తారు. ఉత్సవంలో భాగంగా సీకరి ఇంటి పేరు కలిగిన 10 ఏళ్ల లోపు వయస్సు గల బాలుడ్ని 30 అడుగుల కొరత కొయ్యపై కూర్చోబెట్టారు. తెల్లవారుజామున 4 గంటల నుంచి 5.30 గంటల సమయంలో దానిని మూడు సార్లు నిలుచోబెట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కొయ్యను, కొయ్యపై కూర్చున్న బాలుడిని దేవుని ప్రతిరూపంగా భావించి భక్తులు దర్శించుకున్నారు. కొరతకొయ్యను ఎటువంటి తాడు ఉపయోగించకుండానే చేతులు,కర్రల సాయంతో నిటారుగా నిల్పోబెడతారు. పైకి ఎత్తేటప్పుడు కొరతకొయ్య విరిగినట్టయితే ఆ మూడేళ్ల గ్రామానికి కీడు జరుగుతుందని, విరగకపోతే శుభం జరుగుతుందని గ్రామస్తుల నమ్మకం. ఉత్సవంలో టొంకొరి, రథం, లొట్టిపిట్ట, ఏనుగు ఆకారాలను ఊరేగించారు. పండగలో ఎటువంటి అపశకునాలు జరగకుండా శవయాత్ర జరిపారు. తొమ్మిది రోజుల పాటు గ్రామ పూజారి ఇంట్లో ఉన్న గంగదేవతను చివరిరోజు ఇంటింటికీ తీసుకు వచ్చి దర్శనం కల్పించారు. అనంతరం గ్రామం చివరిలో ఉన్న సంగోడి బయలులో ఉన్న వటవృక్షం కిందకి చేర్చారు.

**ఘటాల సమర్పణ**

గ్రామంలో ప్రతి ఇంటి నుంచి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం సోమవారం రాత్రి గంగాదేవతకు ఘటాలు సమర్పించారు. విశాఖ ఏజెన్సీలో గంగాదేవత ఉత్సవాలు పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నప్పటికీ విజయనగరంలో జరిగే పైడితల్లి సిరిమానోత్సవాన్ని తలపించే విధంగా సీకరి గ్రామంలో కొరత కొయ్య సంబరం నిర్వహిస్తారు. ఈ ఉత్సవానికి అరకు, పాడేరు నియోజకవర్గాలతో పాటు ఒడిశా నుంచి భక్తులు పోటెత్తారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.ఉత్సవాల సందర్భంగా క్రికెట్,వాలీబాల్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

**గిరిజన సంస్కృతిని కాపాడుకోవాలి: ఎంపీ**

గంగాదేవత ఉత్సవాలు జరిగే సీకరి.. అరకు ఎంపీ గుమ్మా తనూజరాణి స్వగ్రామం. ఆమె మంగళవారం గంగదేవతను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజనుల ఆచారాలు, పండగలు, సంస్కృతిని కాపాడుకోవాలన్నారు. ఈ ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ, సర్పంచ్ గుల్లేలు కృష్ణారావు,ఎంపీటీసీ వంతాల ఆనంద రావు, గ్రామ పెద్దలు ఎస్.బి.ఎల్. స్వామి, శేషగిరి, వెంకటరమణ,తిరుపతి వెంకటేశ్వర్లు,లకే సింహాచలం, 14 గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

**నేటి నుంచి సంక్రాంతి**

సీకరి పంచాయతీలో బుధవారం నుంచి సంక్రాంతి పండగ ప్రారంభమవుతుంది. గంగదేవత ఉత్సవం నిర్వహించే ఏడాది గ్రామంలో సంక్రాంతి పండగను వాయిదా వేసి, ఉత్సవం అనంతరం నాలుగు రోజుల పాటు జరుపుకోవడం ఆనవాయితీ.



కొరత కొయ్యపై కూర్చొని భక్తులకు దర్శనమిచ్చిన బాలుడు



సిరిమానోత్సవంలో భక్తుల సందడి



ఘటాలు మోసుకెళ్తున్న భక్తులు

## 1/70 చట్టం రద్దు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదు



అఖిలపక్ష నేతలతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: 1/70 చట్టాన్ని రద్దు చేసే ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టరేట్‌లో అఖిలపక్షాలు, గిరిజన, ప్రజా సంఘాలు, జేఏసీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన చట్టాలు, హక్కులను పరిరక్షిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రకటించారని, 1/70 చట్టం రద్దు చేస్తారనే అపోహలను గిరిజనులు నమ్మవద్దన్నారు. గిరిజన హక్కులకు భంగం కలగకుండా పక్కాగా అమలుజేస్తామన్నారు. అఖిలపక్ష నేతల వినతులను ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లడంతో ముఖ్యమంత్రి స్పష్టమైన ప్రకటన చేశారన్నారు. గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి కూడా 1/70 చట్టాన్ని మార్చే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని తెలిపారన్నారు. జిల్లాలో 600 ఎల్‌టీఆర్ కేసులు ఉన్నాయని, నాలుగు నెలల్లో పరిష్కరిస్తామన్నారు. గిరిజన హక్కులు, చట్టాలు పరిరక్షణకు ఐటీడీఏలో ట్రైబల్ కౌన్సిల్ ఏర్పాటు చేస్తామని తెలిపారు.

గిరిజన ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధి జరగలేదని స్పీకర్ వ్యాఖ్యానించారని, చట్టం రద్దు చేయాలని అనలేదని ఆయన వివరణ ఇచ్చారు. గిరిజన ప్రాంతాలలో సర్వహక్కులు గిరిజనులకు ఉంటాయన్నారు. గిరిజన సంక్షేమ ఎస్‌డీసీలను నియమించామని చెప్పారు. అఖిలపక్ష నేతలు తెడబారికి సురేష్‌కుమార్, అప్పలనరస, రామారావుదొరలు మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు ఎంతమంది ఉన్నారో వివరాలు సేకరించాలన్నారు. తామరాపల్లి, యూ.చీడిపాలెంలో నకిలీ కుల ధ్రువీకరణపత్రాలతో సర్పంచ్ పదవులకు పోటీ చేశారని తెలిపారు. అనంతగిరిలో హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లపై కలెక్టర్ దృష్టి పెట్టాలన్నారు. గిరిజనేతర ఓట్లను మైదాన ప్రాంతాలకు బదలాయించాలని వారు కోరారు.

## నిరుద్యోగులకు ఉపాధి ఆధారిత కోర్సుల్లో ఉచిత శిక్షణ

సింధియా: సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ మారిటైమ్ షిప్ బిల్డింగ్(సెమ్స్)లో టయోట్స్ రేర్ ఎర్త్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సౌజన్యంతో సీఎన్‌సీ ఆపరేటర్, ఇన్వెంటరీ కంట్రోలర్, వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్ తదితర ఉపాధి ఆధారిత కోర్సుల్లో రెండు నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ సీఈవో సేతు మాధవన్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణకు 18 నుంచి 27 ఏళ్ల వయసు కలిగిన ఇంటర్, ఐటీఐ, డిప్లమో కోర్సుల్లో మెకానికల్, ఎలక్ట్రికల్ ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకులు అర్హులు. ఆసక్తి కలిగిన విశాఖ, అనకాపల్లి జిల్లాలకు చెందిన అభ్యర్థులు సింధియా జంక్షన్ సమీపంలోని సెమ్స్ కేంద్రంలో గానీ, 86884 11100, 83319 01237, 0891-2704010 ఫోన్ నంబర్లలో గానీ ఈ నెల 17వ తేదీలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు.

## 515 కేజీల గంజాయి పట్టివేత

- ఏజెన్సీ నుంచి ఢిల్లీకి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడి
- దీని విలువ రూ.25.75 లక్షలు ఉంటుందని అంచనా



పట్టుబడిన గంజాయి, నలుగురు నిందితులతో ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: ఏజెన్సీ నుంచి ఢిల్లీకు గంజాయి తరలిస్తున్న ముఠాను పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. మాకవరపాలెం పోలీస్‌స్టేషన్ పరిధిలో పైడిపాల జంక్షన్ వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా 515 కేజీల గంజాయి పట్టుబడింది. ఈ కేసు వివరాలను ఎస్పీ తుహిన్ సిన్హా వెల్లడించారు. మంగళవారం ఉదయం 10.30 గంటల సమయంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై పి.దామోదర్‌నాయుడు పైడిపాల జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తుండగా బొలెరో వ్యాన్‌తోపాటు మరో మూడు మోటర్ సైకిళ్లపై తరలిస్తున్న గంజాయి పట్టుబడింది. పరారవుతున్న నిందితులను పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. చింతపల్లికి చెందిన వంతల మోహన్‌రావు, ఒడిశా రాష్ట్రం కోరాపుట్‌కు చెందిన సిందేరి కుందర, మాకవరపాలెం మండలం సీతన్నగ్రహారానికి చెందిన ఇయ్యపు రాజ్‌కుమార్, నర్సీపట్నానికి చెందిన పల్లా శ్రీనివాసరావులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 22 ప్లాస్టిక్ గోనె సంచులలో పట్టుబడిన 515 కేజీల గంజాయి విలువ సుమారు రూ.25 లక్షల 75 వేలు ఉంటుంది. నర్సీపట్నం డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాసరావు, ఎస్‌బీ డీఎస్పీ బి.అప్పారావు, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ బాల సూర్యరావు, నర్సీపట్నం రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, మాకవరపాలెం ఎస్సై దామోదర్‌నాయుడు, నర్సీపట్నం రూరల్ సర్కిల్ ఎస్సైలు, సిబ్బంది, ఐటీ కోర్ టీమ్‌ను అనకాపల్లి ఎస్పీ అభినందించారు.

## పంట మార్పిడితో మంచి దిగుబడి

మేడిచర్లలో రైతులకు సూచనలను చేసిన అనకాపల్లి జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు

కె.కోటపాడు: రబీలో రైతులు ఉలవ, జనుము పంటను సాగు చేయడం వల్ల భూసారం పెరగడంతో పాటు మంచి ఆదాయం వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు తెలిపారు. మండలంలో మేడిచర్ల గ్రామంలో మంగళవారం ఆయన అపరాల పంటలను పరిశీలించారు. జనుము పంటను భూమిలో కలియదున్నడం వల్ల సారవంతంగా మారడంతో పాటు ఖరీఫ్‌లో కలుపు ఉండదన్నారు. రైతులు తప్పకుండా పంట మార్పిడి పద్ధతి పాటించి సాగు చేయాలని తెలిపారు. ఈ-పంట నమోదు కార్యక్రమం ఈ నెలాఖరుతో ముగియనున్నట్లు తెలిపారు. కె.కోటపాడు మండలంలో ఇప్పటి వరకూ 1,006 ఎకరాల్లో పంటలను 997 మంది నమోదు చేయించారన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతుల వ్యక్తిగత, పట్టాభూమి వివరాలను రైతు సేవా కేంద్రాల్లో వ్యవసాయశాఖ సహాయకులను అడిగి తెలుసుకున్నారు. ఫార్మర్ రిజిస్ట్రీ యాప్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తితే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నమోదు వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, ఏఈవోలు లైలాదేవి, ప్రియాంక పాల్గొన్నారు.

## 400 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం



ధ్వంసం చేసిన బెల్లం పులుపు

పాయకరావుపేట: మండలంలో గుంటపల్లి గ్రామ శివారు ఆవ ప్రాంతంలో దాడులు నిర్వహించి 400 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనువాసు తెలిపారు. సారా తయారీ చేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకుని యలమంచిలి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది జె.నాగప్రసాద్, డి.నాగశంకరరావు, ఏఈహెచ్‌సీ బి.రమణ పాల్గొన్నారు.

## కాశీ నుంచి కాశీకి స్కేటింగ్ యాత్ర

- కథక్ నృత్యకారిణి సోనీ చౌరాసియా సాహసం



యాత్రలో భాగంగా స్కేటింగ్ చేస్తున్న సోనీ చౌరాసియా

యలమంచిలి రూరల్: దేశ సమైక్యత, సమగ్రతలతో పాటు మహిళా సాధికారత లక్ష్యంగా ప్రముఖ కథక్ నృత్యకారిణి సోనీ చౌరాసియా ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కాశీ నుంచి తిరిగి కాశీకి రోలర్ స్కేటింగ్ యాత్ర చేస్తున్నారు. సుమారు 10,550 కిలోమీటర్ల మేర కొనసాగుతున్న ఈ యాత్ర మంగళవారం యలమంచిలి పట్టణానికి చేరుకుంది. కథక్‌తో పాటు స్కేటింగ్‌లో నైపుణ్యమున్న సోనీ చౌరాసియా గతంలో కూడా ఇదే తరహాలో యాత్రలు చేశారు. ఈసారి ఏకంగా కాశీ నుంచి కాశీ వరకు సుదీర్ఘ యాత్ర చేస్తున్నట్లు ఆమె స్థానిక మీడియాకు తెలిపారు. ఆరోగ్య భారత్ రోలర్ స్కేటింగ్ యాత్ర 2.0తో చేపడుతున్న ఈ యాత్ర దేశంలో 20 రాష్ట్రాలు, 500 పట్టణాలు, నగరాలు, 10 వేల గ్రామాల మీదుగా కొనసాగుతుందన్నారు. ఈ ఏడాది జనవరి 20న కాశీలో ప్రారంభమైన తన యాత్ర వచ్చే మే 12వ తేదీకి తిరిగి కాశీకి చేరుకోవడంతో ముగుస్తుందని సోనీ చౌరాసియా తెలిపారు. మహిళలకు విద్య, రక్షణ, సమానత్వం గురించి యాత్రలో భాగంగా అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు.

## నేడు తాండవ నల్లగొండమ్మ గిరి ప్రదక్షిణ

- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ కమిటీ
- భక్తులకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్ల పంపిణీకి సిద్ధం



కొండ దిగువన తాండవ రిజర్వాయరు గట్టు కిందన నల్లగొండమ్మ తల్లి ఆలయం (ఇన్‌సెట్) నల్లగొండమ్మతల్లి

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి నల్లగొండమ్మ తల్లి గిరి ప్రదక్షిణకు ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. తాండవ రిజర్వాయరు గట్టు దిగువ ప్రాంతంలో వెలసిన అమ్మవారి ఆలయం కొండ చుట్టూ బుధవారం గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. తొలుత ఇక్కడ అమ్మవారిని దర్శించుకుని ఏ పని తలపెట్టి ప్రారంభించినా అవలీలగా పూర్తవుతుందన్న అపారమైన నమ్మకం ఈ ప్రాంత వాసుల్లో ఉంది. అమ్మవారి ఆశీస్సులతోనే తాండవ ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయని చెబుతుంటారు. ఈ ప్రాజెక్టు నిర్మించకముందు నాతవరం, కొయ్యూరు, గొలుగొండ మండలాలకు చెందిన 25 గ్రామాలకు ఇలవేల్పుగా పూజలందుకునేది. ఆ తర్వాత ఇతర ప్రాంతాల భక్తులు ఆరాధిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో ఏటా ఫిబ్రవరిలో వచ్చే మాఘపౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణ చేస్తుంటారు. నాతవరం మండలంలో తాండవ, మాధవనగరం, ఉటమల్ల, తాళ్లపాలెం, చమ్మచింత, జాలారిపేట, నాతవరం, గంటావారి కొత్తగూడెం, వల్సంపేట, గుమ్మడిగొండ, కె.వి.శరభవరం, పొట్టినాగన్నదొర పాలెం, గొలుగొండ మండలంలో సారికమల్లవరం, పాగచెట్లపాలెం, జోగుంపేట, వెంకటాపురం, అమ్మపేట, చోద్యం, కొయ్యూరు మండలంలో ఆడాకుల రొంగలికొత్తూరు, కృష్ణారం, మాడుగుల బాలారం, కంఠారం, తదితర గ్రామాలు నుంచి భక్తులు రానుండటంతో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. ఈ గిరి ప్రదక్షిణ మూడు మండలాల పరిధిలో సుమారుగా ఏడు కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని దారి మధ్యలో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందిస్తారు. ఆలయ ప్రాంగణంలో అన్నదానం ఏర్పాటు చేయనున్నారు.

# సందడిగా మాఘ పౌర్ణమి జాగరణ



పూడిమడక తీరంలో జాగరణ కోలాహలం (ఇన్‌సెట్) విద్యుద్దీపాలతో పూడిమడక తీరం కళకళ

- పూడిమడక తీరంలో జాతర ఏర్పాట్లను పరిశీలించిన డీఐజీ
- పలు తీరాల్లో నేడు పుణ్య స్నానాలు ఆచరించనున్న భక్తులు

అచ్యుతాపురం:

పూడిమడక మాఘ పౌర్ణమి జాగరణ మంగళవారం సాయంత్రం సందడిగా మొదలైంది. లక్షకు పైగా భక్తులు పాల్గొనే ఈ జాగరణ, పుణ్య స్నానాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని డీఐజీ గోపీనాథ్ జెట్టీ సూచించారు. సముద్ర తీరంలో ఏర్పాటు చేసిన సదుపాయాలను ఆయన ఎస్పీ తుహిన్ సిన్హా, డీఎస్పీ విష్ణు స్వరూప్‌లతో కలిసి పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని డీఐజీ స్థానిక సీఐ గణేశ్‌కు సూచించారు. గజ ఈతగాళ్లకు అందుబాటులో ఉంచాలన్నారు.

**శోభాయమానంగా విద్యుద్దీపాలు**

సాయంత్రం నుంచి తీర ప్రాంతంలో స్టాళ్లు ఏర్పాటు చేశారు. విద్యుద్దీపాలతో పరిసరాలు కళకళలాడాయి. తినుబండారాలు, ఆట వస్తువులు విక్రయించే దుకాణాలతో సందడి నెలకొంది. పూడిమడక ఉన్నత పాఠశాల జంక్షన్ వద్ద పోలీస్ చెక్ పోస్టు ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి ఎటువంటి వాహనాలను అనుమతించకుండా చర్యలు తీసుకున్నారు. బుధవారం తెల్లవారుజాము నాటికి భక్తుల తాకిడి మరింత పెరగనుంది.

**రేవుపోలవరం తీరంలో విస్తృత ఏర్పాట్లు**

ఎస్.రాయవరం: రేవుపోలవరం తీరంలో బుధవారం మాఘపౌర్ణమి జాతర పెద్ద ఎత్తున జరగనుంది. నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ, డీఎస్పీ పి.శ్రీనివాసరావు మంగళవారం రేవుపోలవరం తీరానికి వచ్చి ఏర్పాట్లు పరిశీలించారు. మహిళలు వస్త్రాలు మార్చుకునేందుకు తాత్కాలిక మరుగుదొడ్లు, పెద్ద ఎత్తున వచ్చే భక్తులకు అవసరమయ్యే తాగునీటి వసతి తదితర సదుపాయాలపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. 210 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్టు డీఎస్పీ చెప్పారు. 20 మంది గజ ఈతగాళ్లను ఏర్పాటు చేశామన్నారు. మాఘపౌర్ణమి జాతరకు అడ్డురోడ్డు నుంచి రేవుపోలవరం తీరానికి భక్తులను తరలించేందుకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్టు ఆర్డీవో చెప్పారు. నర్సీపట్నం, అనకాపల్లి, సింహాచలం, గాజువాక డిపోల్లో మంగళవారం అర్ధరాత్రి నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.